తియ్యని బిజినెస్

- విరివిగా చెరకు రసం దుకాణాలు
- వేసవి తాపాన్ని తీర్చుతున్న పానీయం



విద్యుత్ యంత్రంపై చెరకు రసం తీస్తున్న మహిళ

సామర్లకోట: వేసవి ఎండల తాపంతో ప్రతి ఒక్కరి చూపూ చెరకు రసంపైనే ఉంటుంది. దీనికి అనుగుణంగా చెరకు రసం విక్రయ దుకాణాలు పెరిగాయి.. వ్యాపారులూ పెరిగారు. రూ.30 వేల నుంచి రూ.రెండు లక్షల మధ్య చెరకు రసం మెషీన్లు రావడంతో నిరుద్యోగ యువత కొందరు దీనివైపు మొగ్గు చూపుతున్నారు. మరో కోణంలో చూస్తే చక్కెర కర్మాగారాలు మూతపడడంతో ముదురు, లేత, మధ్యస్తంగా ఉన్న చెరకును ఈ రసం విక్రయించే వ్యాపారులు కొనుగోలు చేసేస్తున్నారు. ముదురు చెరకు ఆరోగ్యకరమైనది కాగా, లేత చెరకు రసానికి పనికిరాదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే కర్మాగారాలు లేకపోవడంతో చక్కెర దిగుబడి కూడా తగ్గిపోయింది. అలాగే కోతుల బెడద సైతం ఎక్కువగా ఉండడంతో రైతులు సైతం సాగుకు ముందుకు రావడం లేదు.

ఐస్‌కు చెక్.. ఫ్రిజ్‌లలోనే చెరకు ముక్కలు..

సంప్రదాయ రసం తీసే క్రషర్ల స్థానంలో విద్యుత్ యంత్రాలు రావడంతో ఐస్ ముక్కలతో కాకుండా నేరుగా ఫ్రిజ్‌లోనే చెరకు ముక్కలు నిల్వచేసుకునే సౌలభ్యం వచ్చింది. దీంతో ముడి చెరకు రసంలో నిమ్మకాయ కలిపి, అవసరమైతే ఐస్ కలిపి విక్రయిస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో సుమారు 35 వరకు చెరకు రసం దుకాణాలు ఏర్పాటయ్యాయి.



ఫ్రిజ్‌లో నిల్వ చేసిన చెరకు ముక్కలు

సీజనల్ వ్యాపారం...

సేంద్రియ విధానంలో పండించిన చెరకు నుంచి రసం తీసి విక్రయిస్తే ఆరోగ్యం. వేసవిలోనే చెరకు రసానికి డిమాండ్ ఉంటుంది. దీంతో రూ.1.25 లక్షలతో యంత్రం కొనుగోలు చేసి రసాన్ని విక్రయిస్తున్నా. పెద్దాపురం మండలం దివిలి నుంచి కట్ట చెరకు గడలను రూ.180కి కొనుగోలు చేస్తున్నాం. గ్లాసు చెరకు రసం రూ.10 నుంచి రూ.20 వరకు, అర లీటరు 30, లీటరు రూ.60కి విక్రయిస్తున్నాం. ఇద్దరి యువకుల సాయంతో విక్రయాలు సాగిస్తున్నా.

– ఆర్.శివకుమార్, చెరకు రసం వ్యాపారి, సామర్లకోట

క్లుప్తంగా

భూసారం మేరకు సాగు

- జిల్లా స్థాయి శిక్షణలో జేడీ విజయకుమార్



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించిన జేడీ విజయకుమార్

సామర్లకోట: భూమి సారాన్ని బట్టి పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయకుమార్ అన్నారు. జిల్లాలోని ఏఓలు, ఏడీఏలు, వీఏఏలకు జిల్లా స్థాయిలో బుధవారం సాయంత్రం ఉండూరు ఆర్బీకేలో నిర్వహించిన శిక్షణకు ఆయన అధ్యక్షత వహించారు. నేల రకాలు, స్వభావం, సమస్యాత్మక భూముల నిర్వాహణ, మట్టి నమూనాల సేకరణ పద్ధతి, ఐత చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాట్ శాస్త్రవేత బాలాజీనాయక్, ఏడీఏ మాధవి, ఏఓ ఐ.సత్య, వీఏఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్టి నమూనాల సేకరణపై క్షేత్రస్థాయిలో జేడీ అవగాహన కల్పించారు.

శాంతివర్ధన సేవలు అభినందనీయం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సుబ్బారావు

పెద్దాపురం: మండలంలోని పులిమేరులో ఉన్న శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్మిక నాయకులు, సామర్లకోట కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు సేవా కార్యక్రమాలు చేశారు. కేంద్రం నిర్వాహకులు వీరబాబు, సత్య దంపతు సేవలను కొనియాడారు. అనంతరం అక్కడి విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేసి వడ్డించారు. కౌన్సిలర్ దూది రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సత్య, ఏఓ వేణు తదితరులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.చిన్న మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్నామన్నారు. పారిశుధ్య కార్మికుల వేతనాలు ప్రతి నెలా ఒకటో తేదీన వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గొల్లప్రోలు మండల సీఐటీయూ నాయకుడు నందీశ్వరరావు, కార్మికులు నేలావు ఏసమ్మ, సీహెచ్‌వీ రమణ, బి.సత్యవతి, లోవబాబు, సీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

18న మండల సమావేశం

సామర్లకోట: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్ మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ఆటపాటలతో బోధించండి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

కరప: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను మానసికంగా సంసిద్ధులను చేసి, ఆటపాటలతో విద్యాబోధన చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి సూచించారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆమె మండలంలోని పెద్దాపురప్పాడు, కొంగోడు, పెనుగుదురు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. కాన్వెంట్లతో ధీటుగా విద్యాబోధన మెరుగుపరచాలని, గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య గడువు తేదీ పొడిగించడానికి రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రిన్సిపల్ సెక్రటరీలకు లేఖ రాసినట్టు ఆదిలక్ష్మి వివరించారు. సీడీపీఓ జి.వెంకటరమణ, గొర్రిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి ఆమె వెంట ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి
- చేబ్రోలులో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ తనిఖీ



సమీక్షలో మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి

పిఠాపురం: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులతో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,70,815 మంది విద్యార్థులను విద్యాకానుకకు అర్హులుగా గుర్తించామన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలను భద్ర పర్చడానికి మండలానికి ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. స్టాక్ పాయింట్లలో పుస్తకాల భద్రత, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలను పరిశీలించడానికి రాష్ట్రంలో 26 జిల్లాలకు 26 మంది ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. తాను తూర్పు గోదావరి జిల్లా ప్రత్యేకాధికారిగా గత మూడు రోజులుగా పర్యటిస్తూ స్టాక్ పాయింట్లను పరిశీలిస్తునట్టు చెప్పారు. పుస్తకాల పంపిణీకి మండలాల వారీగా రెండు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటిలో ఒక కమిటీకి ఎంఈఓ చైర్మన్‌గా, పాఠశాలల హెచ్‌ఎంలు కన్వీనర్లుగా, వనరుల కేంద్ర ఉద్యోగులు సభ్యులుగా ఉంటారన్నారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి వంద శాతం పుస్తకాలను అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం నూకరాజు తదితరులు ఉన్నారు.

జేవీకే కిట్లను సకాలంలో అందజేయండి

సామర్లకోట: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లు అందేలా చూడాలని ప్రాంతీయ విద్యాశాఖాధికారి జి.నాగమణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఈ కిట్లను నిల్వ చేసే పాయింట్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి ఈ కిట్లు అందజేయాలని అన్నారు. ఈ పాయింట్ నుంచి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు కిట్లు అందజేయాల్సిన బాధ్యత ఎంఈఓపై ఉంటుందని, సీఆర్పీలు, ఎంఆర్‌సీలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎంఈఓగా కన్వీనర్‌గా, ఏపీఎం, మండల ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఒక కమిటీగా పంపిణీ చేయాలన్నారు. మండల పరిధిలో 16 హైస్కూళ్లు, నాలుగు యూపీ, 54 ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయని, గత విద్యా సంవత్సరం రోల్ ప్రకారం 9,800 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ వై శివరామకృష్ణయ్య, పీఆర్ డీఈ భాస్కర్‌రమేష్, మండల ఏఈ మణిమాల, ఏపీఎం బి.ప్రశాంతి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. వినికిడి లోపం ఉన్న భవిత పాఠశాలలోని నలుగురు విద్యార్థులకు వినికిడి యంత్రాలను అందజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఈ సందర్భంగా వేతన బకాయిలు చెల్లించాలని సమగ్ర శిక్షణ ఉద్యోగులు విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణికి వినతి పత్రం సమర్పించారు.

స్పందన ఫిర్యాదుపై విచారణలో గలాటా

- పరుగులు తీసిన అధికారులు
- కేసు నమోదు చేసిన పోలీసులు



సర్పంచ్ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సామర్లకోట: మండల పరిధిలో పి.వేమవరం గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలో బెదిరిపోయి అధికారులు పరుగులు తీసిన సంఘటన ఇది. పంచాయతీ పరిధిలోని చేపల చెరువులో అవినీతిపై గ్రామానికి చెందిన నాగబాబు స్పందనలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ విక్టర్ బుధవారం పి.వేమవరం పంచాయతీ చెరువును పరిశీలించి నాగబాబు నుంచి సమాచారం సేకరించారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా ఇస్తే కలెక్టరుకు సమర్పించి చర్యలు తీసుకుంటామని డీపీఓ సూచించారు. ఈ క్రమంలో చేపల చెరువులో ఏమీ లేనిదే అల్లరి సృష్టిస్తున్నారని సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం డీపీఓకు వివరిస్తున్న సమయంలో అల్లరి మూకలు ఒకేసారి పంచాయతీ కార్యాలయంలోకి ప్రవేశించి గందరగోళం చేశాయి. దీంతో డీపీఓ, ఎల్‌పీఓ అమ్మాజీ, ఇతర అధికారులు పరుగులు తీశారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ తీవ్ర స్థాయికి చేరుకోవడంతో పర్నిచర్ ధ్వంసమైంది. సర్పంచ్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సామర్లకోట, తిమ్మాపురం పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వై.శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



పాత ఇసుకపల్లిలో మహిళకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ వలంటీర్ల ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. పాత ఇసుకపల్లిలో సచివాల కన్వీనర్ యరకం వెంకట వివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో యరకం నూకరెడ్డి, కూతా నాగిరెడ్డి, రామ సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కరణంగారితోట ప్రాంతానికి చెందిన ఓ ఇంట్లో బుధవారం పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ కథనం ప్రకారం.. గొల్లప్రోలు నగర పంచాయతీ కరణంగారితోటలో న్యాయవాది మర్రి సత్యవతి తన తల్లితో కలిసి నివాసముంటున్నారు. బుధవారం ఉదయం సత్యవతి న్యాయవాది వృత్తి రీత్యా పిఠాపురం కోర్టుకు వెళ్లిపోయింది. ఇంట్లో ఉన్న ఆమె తల్లి ఇంటి తలుపులు వేసి పక్కనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. రెండు గంటల అనంతరం ఆమె ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి వెనుక వైపు ఉన్న కిటికీ, ఇంటి తలుపులు తీసి ఉండడం చూసి కంగారు పడి పెద్దగా కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు 14 కాసుల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిఠాపురం సీఐ సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లు ఆధారాలను సేకరించాయి. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిత సేవలు సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో వినికిడి యంత్రాలను అందజేస్తున్న ఆర్జేడీ నాగమణి

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు భవిత సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ఆర్జేడి జి.నాగమణి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న ప్రత్యేక ఫిజియోథెరపీ వైద్య సేవలపై బుధవారం ఆమె ఎంఈఓ సీహెచ్‌వీవీ సత్యనారాయణతో కలసి పరిశీలించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించి, వినికిడి యంత్రాలను ఆమె అందజేశారు. ఐఈ కో–ఆర్డినేటర్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం ఎంఎల్ శివజ్యోతి, భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



మాతావారి పాలెంలో ఆందోళన చేస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం శివారు మాతావారి పాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనికి నిరసనగా బుధవారం అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

15 నుంచి చేపల వేట నిషేధం



జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ

కొత్తపల్లి: సముద్రంలో చేపల వేట నిషేధం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ అమలులో ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. అమీనాబాదు తీర ప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వేట నిషేధంపై ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. జిల్లాలో 4645 బోట్లు ఉన్నాయన్నారు. వీటిలో మెకనైజ్డ్ 467, మోటరైజ్డ్ 3779, సాంప్రదాయ బోట్లు 399 ఉన్నాయని వివరించారు. వేట నిషేధ సమయంలో 61 రోజుల పాటు సంప్రదాయ బోట్లు మినహా మిగిలిన బోట్లపై వేటకు వెళ్లరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే వలలను ఉపయోగించాలన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా కోసం ఈ నెల 17న ఎన్యుమరేషన్ కార్యక్రమం చేపడతామన్నారు. బోట్లు నిలిపే ప్రదేశానికి బోటు యజమాని, కళాసీలు తప్పని సరిగా హాజరు కాలన్నారు. బోటు రిజిస్ట్రేషన్ ఫారం, సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు జెరాక్స్‌లు తప్పని సరిగా తీసుకు రావాలని సూచించారు. వేట నిషేధం అమలుపై తీర గ్రామాల్లో టాంటాం వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీ శ్రావణి, మత్స్యశాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రాజెక్టుకు జాతీయ పురస్కారం

- ఫైన్‌లో ప్రదర్శనకు పేటెంట్ హక్కు



మెషీన్ ఫర్ ది మేసన్ ప్రాజెక్టుతో విద్యార్థి దుర్గాప్రసాద్, గైడ్ ఎస్ఎస్ఎస్ భవాని

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భవన నిర్మాణంలో సీలింగ్‌కు ప్లాస్టింగ్ చేయడంలో తాపీ మేస్త్రికి ఎంతో ఉపయోగపడేలా రూపొందించిన మెషీన్ ఫర్ ది మేసన్ ప్రాజెక్టుకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది. స్థానిక నెహ్రూ పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిదుర్గాప్రసాద్, గైడ్ ఎస్ఎస్ఎస్ భవాని రూపొందించిన ఈ ప్రాజెక్టును ఇన్‌స్పైర్-మనక్ 2021-21 పోటీల్లో ప్రదర్శించగా రాష్ట్రానికి వచ్చిన మూడు జాతీయ స్థాయి అవార్డుల్లో ఇదీ ఒకటిగా నిలిచింది. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రం ఢిల్లీలో ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్-23 (ఫైన్)లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 658 ప్రాజెక్టులలో 60 ప్రాజెక్టులు ఎంపిక చేశారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. సీలింగ్ ప్లాస్టింగ్‌లో సులువుగా గడంచిలను రిమోట్ సాయంతో జరపడం, తక్కువ సిమెంట్ ఉపయోగించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలని తెలిపారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

- పంచారామ క్షేత్రంలో ఎస్పీ పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఆశీర్వచనాలు అందజేసిన ఆలయ పండితులు

సామర్లకోట: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత బుధవారం సాయంత్రం స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన మూర్తులతో పాటు, ఉప ఆలయాల్లోని దేవలతను ఆయన దర్శించి పూజలు చేయించుకున్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబు, వినయ్ ఎస్పీకి ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఎస్పీకి స్వామి వారి ఫొటోను, ప్రసాదం అందజేశారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ, ఎస్సైలు ఆడపా గరగారావు, విజయ్‌కుమార్, టి.సునీత, సురేష్, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌ను అభిమానించే ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

- వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి
- జగ్గంపేటలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



జగ్గంపేటలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానించే ప్రతిఒక్కరినీ పార్టీ నేతలు, కార్యకర్తలు గౌరవించాలని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డి సూచించారు. జగ్గంపేటలో బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల మంచి అభిప్రాయం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి నేతలు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ కష్టపడి పనిచేసే ఏ ఒక్క ఎమ్మెల్యేను సీఎం వదులుకోరన్నారు. తొలుత మిథున్‌రెడ్డికి జగ్గంపేట శివారు కోనేటి వద్ద మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా ఆధ్వర్యంలోనూ పార్టీనేతలు ఘనస్వాగతం పలికారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జేసీఎస్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



సూరంపాలెంలో నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మిథున్‌రెడ్డి, పార్టీ నేతలు

గండేపల్లి: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్స్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెంలో రూ.2.15 కోట్లతో నిర్మించే నూతన పీహెచ్‌సీ భవనానికి బుధవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి నూతన పీహెచ్‌సీని అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, పార్టీ మండలాధ్యక్షులు కందుల చిట్టిబాబు, గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగా భవాని, నాయకంపల్లి సొసైటీ అధ్యక్షురాలు కుంచే వెంకట రత్న కుమారి, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

జగ్గంపేట: గ్రామానికి చెందిన 50 మంది బీసీ నేతలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా సారధ్యంలో పార్టీలో చేరిన వారికి పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని మిథున్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, దవులూరి దొరబాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయండి

పెద్దాపురం: మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని పట్టణ సీఐటీయూ కమిటీ విజ్ఞప్తి చేసింది. బుధవారం మున్సిపల్ కార్మికులతో కలసి కమిషనర్ జంపా సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. నాయకులు డి.క్రాంతికుమార్, శివకోటి అప్పారావు, సత్యనారాయణ, అచ్చన్న, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయండి

- కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రోగులకు నగదు రహిత వైద్యం అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవల్లో నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక ఆరోగ్య మిత్ర విధులకు సరిగా హాజరు కాని కారణంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఆర్ రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ కె.నవీన్, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.